# మాయ మాటలకు మోసపోవద్దు



కమలాపూర్ మండలం శనిగరంలో ప్రచారంలో పాల్గొన్న జనం



వీణవంకలో మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి బొట్టుపెట్టి, హారతి ఇచ్చి ప్రచారానికి సాగనంపుతున్న సతీమణి శాలిని

- ఈటల మొసలి కన్నీరు కారుస్తడు
- బీసీ బంధు చెక్కులు ఆపిండు
- నాకు అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా
- హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- నియోజకవర్గంలో అట్టహాసంగా ప్రచారం ప్రారంభం

హుజూరాబాద్/ హుజూరాబాద్ రూరల్/ వీణవంక/ కమలాపూర్, నవంబర్ 1: బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ మొసలి కన్నీరు కారుస్తూ, మాయమాటలు చెప్తాడని, ప్రజలు మోసపోవద్దని హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన తన ప్రచారభేరి మోగించారు. ఉదయం వీణవంకలోని తన నివాసంలో ఇష్టదైవానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన సతీమణి శాలిని వీరతిలకం దిద్ది ప్రచారానికి సాగనంపారు. అనంతరం కమలాపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామ పరిధి బత్తివానిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి గోపాల్‌పూర్, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తర్వాత హుజూరాబాద్ మండలంలోని ధర్మరాజుపల్లి, కందుగుల, కనుకులగిద్ద, హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఉప ఎన్నికల్లో కడుపులో తల పెట్టి ఈటల మోసపూరిత మాటలు చెప్పాడని, గెలిచిన తర్వాత కన్నెత్తి చూడలేదని, ఇప్పుడు మరోసారి ఎన్నికలు రాగానే వస్తున్నాడని చెప్పారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, అవి ప్రతి ఇంటికీ వర్తించాయని గుర్తు చేశారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సీఎం కేసీఆర్ చొరవతో శనిగరంను మండలంగా ఏర్పాటు చేయడంతోపాటు డీబీఎం 24 ఎస్సారెస్పీ కాలువను విస్తరించి ప్రతి ఎకరాకు సాగునీరందించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. శనిగరం గ్రామంలో పర్కాల-హుజూరాబాద్ నాలుగు లైన్ల రహదారిపై సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీసీ బంధు చెక్కులను ఆపించాడని తెలిపారు. ఆయనకు ఏడుసార్లు అవకాశం ఇచ్చినా ఎలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. పేదల కోసం పనిచేసే బీఆర్ఎస్‌కు అండగా నిలువాలని కోరారు.

### కదిలిన ఊర్లు

పాడి ప్రచారంలో భాగంగా ఊర్లకు ఊర్లు ఆయన వెంట కదిలాయి. గ్రామాల్లో ఇసుకపోస్తే రాలనంత జనం తరలివచ్చారు. కౌశిక్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి మహిళలు, వ్యాపారులను ఓటు అభ్యర్థించారు. హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లి, కందుగుల, కనుకులగిద్ద గ్రామాల్లో గ్రామస్తులు తమ ఇళ్లకు తాళం వేసి కౌశిక్ వెంట నడిచారు. హుజూరాబాద్ పట్టణంలోని బోర్నపల్లి చౌరస్తాలో ప్రచారం చేయగా చౌరస్తా జనంతో కిక్కిరిసింది. కౌశిక్‌రెడ్డి ప్రచారపర్వానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ప్రతిపక్షాలు గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ప్రచారంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎంపీపీ తడక రాణి, జడ్పీటీసీలు బక్కారెడ్డి, కల్యాణి, సర్పంచులు లక్ష్మారెడ్డి, ప్రభావతి, లడె గోపాల్, పింగిళి రవీందర్‌రంజిత్‌రెడ్డి, ఎంపీటీసీలు పద్మ, వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐలన్న, నాయకులు పింగిళి ప్రదీప్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, చొల్లేటి కిషన్‌రెడ్డి, రవీందర్‌రావు ఉన్నారు.

### రెండేళ్లుగా ముఖం చాటేసిన ఈటల

ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా గెలిచి రెండేళ్లు అవుతున్నా నియోజకవర్గానికి రాకుండా ముఖం చాటేశాడు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా ఒక్క పైసా తీసుకురాలేదు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ లక్షా 30 వేల ఉద్యోగాలు ఇచ్చారు. కేంద్రం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో ఈటల చెప్పాలి. గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు మోసపు మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నాడు. మళ్లీ ఇక్కడి ప్రజలు ఆయనను నమ్మరని గజ్వేల్‌లో పోటీ చేస్తున్నడు. పైసా పనిచేయని బీజేపీ, కాంగ్రెస్ కావాలా? కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావాలా? ప్రజలు నిర్ణయించుకోవాలి. కాంగ్రెస్‌ను నమ్మి కర్ణాటకలో ఓటేస్తే ఐదు గంటల కరంటు ఇవ్వడం లేదని అక్కడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఐదు గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా? 24 గంటల కరంటు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా? తేల్చుకోవాలి. బీజేపీ నుంచి నయాపైసా పట్టుకురాని ఈటలను గ్రామాల్లో తిరుగనివ్వద్దు.

*- గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్*

### బీజేపీ, కాంగ్రెస్‌కు డ్రైవర్ లేడు

బీఆర్ఎస్ పార్టీకి ముఖ్యమంత్రిగా కేసీఆర్ డ్రైవర్‌గా ఉంటే భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలకు డ్రైవర్ (సీఎం)లేడన్నారు. డ్రైవర్‌లు లేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల బస్సు ఎక్కుతారో, డ్రైవర్ ఉన్న బీఆర్ఎస్ పార్టీ బస్సు ఎక్కుతారో ప్రజలు నిర్ణయించుకోవాలని హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జీ ఇనుగాల పెద్దిరెడ్డి విమర్శించారు. హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులని అభివృద్ధి చేసే పార్టీకి అండగా నిలుస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని నియోజకవర్గాన్ని ఎవరు పట్టించుకోరన్నారు.

*- పెద్దిరెడ్డి, బీఆర్ఎస్ హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల ఇన్‌చార్జి*



ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్

# స్వరాష్ట్రంలో పల్లెలకు కొత్త రూపు

- కుల వృత్తులకు చేయూతనిచ్చింది కేసీఆరే
- జైలుకు వెళ్లివచ్చిన వారికే కాంగ్రెస్ టికెట్
- భూ కబ్జాదారులతో జాగ్రత్త.. చెరువులూ మాయం చేస్తారు
- బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, నవంబర్ 1: స్వరాష్ట్రంలో అభివృద్ధితో పల్లెల రూపు రేఖలు మార్చివేశామని బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని ముదిరాజ్, మున్నూరుకాపు సంఘం భవనాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ముదిరాజ్, మున్నూరుకాపు సంఘం, మునూరు కాపు యువజన నాయకులు, కుల సంఘాల సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కులవృత్తులకు చేయూతనిచ్చింది సీఎం కేసీఆరేనని స్పష్టం చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో తనను మూడుసార్లు ఓటు వేసి గెలిపించారని, ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. రైతులకు 24గంటలు నాణ్యమైన కరంట్ అందిస్తున్నామని గుర్తు చేశారు. అత్తగారింటికి వెళ్లి వచ్చినట్టే జైలుకు పోయి వచ్చే వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ దిక్కులేక టికెట్ ఇస్తున్నదని ఎద్దేవా చేశారు. భూ కబ్జాదారులతో తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. గ్రామాల్లో చెరువులను సైతం మాయం చేస్తారని తెలిపారు. ఒక్కసారి ఓటు తప్పుగా వేస్తే అరిగోస తప్పదన్నారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేసి తెలంగాణ అభివృద్ధి కొనసాగేలా తమ చేతులు బలోపేతం చేయాలని కోరారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన ముదిరాజ్, మున్నూరుకాపు, మున్నూరుకాపు యువజన సంఘం నాయకులు, కులస్తులకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, గ్రామ సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, ఎంపీటీసీలు వినయ్, శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ సాయిల మహేందర్, పిట్టల రవీందర్, పప్పు లచ్చయ్య, సొసైటీ అధ్యక్షుడు నూనె రాజేశం, మల్లేశం, రాజు, కొమురయ్య, తాటికొండ మధుకర్, మున్నూరుకాపు సంఘం నాయకులు వరి భద్రయ్య, తోట సత్యనారాయణ, మామిడి అదిరెడ్డి, సంజీవ్, వరి శంకరయ్య, కస్తూరి శ్రీనివాస్ రెడ్డి, నెక్‌పాషా, బాబు, పెంచాల శ్రీనివాస్ రావు, రవితేజా, లక్ష్మారెడ్డి, శ్రావణ్, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.



నగునూర్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మహిళలు



మానకొండూర్: బీజేపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్



తిమ్మాపూర్ రూరల్: కేతిరెడ్డి ఎల్లారెడ్డి దంపతులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రసమయి బాలకిషన్

# బీఆర్ఎస్‌లోకి చేరికలు

మానకొండూర్, నవంబర్ 1: సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన 30 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు సమక్షంలో పార్టీలో చేరారు. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులకు కండువా కప్పి జీవీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డి గణేశ్, పడాల శంకరయ్య, జిల్లెల రాజమౌళి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్కే రహమత్‌అలీ, ఎండీ గౌస్, దుడ్డెల శంకర్, మూల రమేశ్, రాకేశ్, కుమార్, ఆంజనేయులు, దూలం సంపత్, బుర్ర భూమయ్య, బుర్ర రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 1: మండలంలోని మహాత్మానగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేతిరెడ్డి ఎల్లారెడ్డి దంపతులు బుధవారం తిమ్మాపూర్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి రసమయి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేతిరెడ్డి ఎల్లారెడ్డి దంపతులు మాట్లాడుతూ, బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. రసమయి గెలుపునకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, స్వామిరెడ్డి, పాశం అశోక్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు



సీపీ అభిషేక్ మహంతి

రాంనగర్, నవంబర్ 1 : కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా నియమ నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని చెప్పారు. సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 30 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు.